సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 25 । జూలై । 2024



క్రికెట్ పోటీలు ప్రారంభం

కడప లోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాల్లో అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. -8లో



వేధింపులతో వివాహిత ఆత్మహత్య

అత్తింటి వేధింపులతో ప్రియాంక(24) అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన బుధవారం మదనపల్లెలో వెలుగు చూసింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.420	రూ.480
రెండోరకం	రూ.340	రూ.416



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1214 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	390	400
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 117.40 కిలోలు

న్యూస్‌రీల్

భూ వివాదాల సమస్యలు స్వీకరణ

రాయచోటి: అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ డివిజన్‌కు సంబంధించిన భూ వివాదాల సమస్యలపై అందించిన వినతులను రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్‌పీ సిసోడియా గురువారం స్వీకరిస్తారని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం సాయంత్రం 4 గంటల నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. సబ్ డివిజన్‌లోని 11 మండలాలకు సంబంధించి గత రెండు నుంచి మూడు సంవత్సరాల భూ వివాదాల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ)కి సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ ప్రకటనలో తెలియజేశారు.

సబ్‌కలెక్టర్‌గా వైఖోమ్ నిదియాదేవి బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిదియాదేవి

రాజంపేట: రాజంపేట సబ్‌కలెక్టర్‌గా వైఖోమ్ నిదియాదేవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈమెకు ఆర్డీవో మోహనరావు బాధ్యతలను అప్పగించారు. అంతకుముందు సబ్‌కలెక్టరేట్‌కు రాగానే పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఇన్‌వార్డు ఏవో సుజాత సబ్‌కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. రాజంపేట, రైల్వేకోడూరు తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు సబ్‌కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

29 నుంచి పసుపు కొనుగోలు నిలిపేస్తాం

కడప అగ్రికల్చర్: వైఎస్సార్ జిల్లా కడప మార్కెట్‌యార్డులో గత కొన్ని నెలల నుంచి కొనసాగుతున్న శీతల గిడ్డంగి నిర్మాణ సమస్యను పరిష్కరించకుంటే ఈ నెల 29 నుంచి పసుపు కొనుగోళ్లను నిలిపివేస్తామని టర్మరిక్ మర్చంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ విషయమై బుధవారం కడప మార్కెటింగ్ శాఖ జేడీకి వినతిపత్రమిచ్చారు.

రిమ్స్‌లో 'నిఫా వైరస్' ప్రత్యేక వార్డు

కడప అర్బన్(వైఎస్సార్‌జిల్లా): కడప ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఐడీ విభాగంలో 'నిఫా వైరస్' బాధితుల కోసం 10 పడకల ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. బుధవారం ఈ వార్డును ప్రారంభించారు. ఎవరైనా 'నిఫా వైరస్' తో బాధపడుతూ వస్తే వారికి ప్రత్యేకంగా చికిత్స చేసేందుకు ఈ వార్డును ఉపయోగించుకోవచ్చని రిమ్స్ ఆర్‌ఎంఓ. వై. శ్రీనివాసులు తెలియజేశారు. ఈ వైరస్‌తో బాధపడుతూ ఉండేవారికి మైక్రోబయాలజీ, జనరల్ మెడిసిన్, పల్మనాలజీ, అనస్థీషియా విభాగాలకు సంబంధించిన వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండి, వైద్య సేవలను అందిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ యాదవేంద్రారెడ్డి, వైద్యులు అర్జునకుమార్, నూకరాజు, సీఎస్‌ఆర్‌ఎంఓలు గీత, సునీత, అనస్థీషియా హెచ్‌ఓడీ డాక్టర్ సునీల్ చిరువెళ్ల తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందించకుండానే పనులా!



పనులు జరుగుతున్న చోట నిరసన తెలుపుతున్న బాధిత రైతులు

మైదుకూరు: బళ్లారి – కృష్ణపట్నం నేషనల్ హైవే నిర్మాణం కోసం విలువైన భూములు కోల్పోయామని.. నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కుటుంబ సభ్యులతో కలసి వైఎస్సార్ జిల్లా మైదుకూరులోని ప్రొద్దుటూరు రోడ్డులో జరుగుతున్న హైవే పనులను బుధవారం అడ్డుకుని నిరసన తెలిపారు. రైతులకు మద్దతుగా సీపీఎం అనుబంధ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు. సమాచారం అందుకున్న మైదుకూరు అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మస్తాన్, అర్బన్ ఎస్‌ఐ ఫణి మద్దిలేటి అక్కడికి చేరుకున్నారు. పనులను అడ్డుకొని నిరసన తెలియజేస్తున్న రైతులతో, రైతు సంఘం నాయకులతో మాట్లాడారు. సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో రైతులు నిరసన విరమించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు నేషనల్ హైవేకు భూములు కోల్పోయిన బాధిత రైతుల సమస్యలను పరిష్కరించి వారికి నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజాగళం వినపడుతోందా?

చంద్రబాబు ప్రజాగళం పేరుతో అలవికాని హామీలు ఇచ్చారు. ప్రజలు నమ్మారు. అధికారం ఇచ్చారు. ప్రస్తుతం హామీల ఊసే ఎత్తడం లేదు. బాబుతో పాటు కూటమి నేతలు ఇచ్చిన హామీలపై ఆశలు పెట్టుకున్న ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారు. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- మేనిఫెస్టో పేరుతో బురిడీ
- హామీల అమలుపై దృష్టిపెట్టని వైనం
- అధికారంలోకి వచ్చాక ఆర్థికం పేరుతో ఆలస్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- వైఎస్ జగన్ సర్కార్ హయాంలో ఠంఛనుగా ఇంటికే సంక్షేమం



సాక్షి రాయచోటి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇప్పటికీ సంక్షేమం వైపు అడుగులు పడటం లేదు. ఉద్యోగులకు జీతాలు, పింఛన్లతో సరిపెడుతూ...ఎన్నికల్లో ఇచ్చిన హామిల అమలు వైపు అడుగులు వేగంగా పడటం లేదు. ప్రధానంగా ఎన్నికల మ్యానిఫెస్టోలో రైతులతో పాటు నిరుద్యోగులు, విద్యార్థుల తల్లులకు ప్రత్యేక పథకాల ద్వారా అందిస్తామని చెప్పిన హామిలపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. తల్లికి వందనం అంటూ జీఓ విడుదల చేసినా మార్గదర్శకాల పేరుతో కాలయాపన సాగుతోంది. ఇదేకాకుండా ఇంకా కూటమి సర్కార్ చెప్పిన సంక్షేమ పథకాల అమలు విషయంలో ఆర్థిక సమస్యలంటూ వైఎస్సార్ సీపీపై నిందారోపణలు చేస్తున్నారే తప్ప చిత్తశుద్ధితో అడుగులు ముందుకు పడడం లేదు. అధికారంలోకి వచ్చి నెలన్నర రోజులు అవుతున్నా కూడా ఇంతవరకు నిర్ణయాల విషయంలో వెనుకంజ కనిపిస్తోంది. మరోవైపు అన్నదాతలు మొదలుకొని పాఠశాలల్లో చదివే పిల్లల తల్లులు, నిరుద్యోగులు సైతం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.



నా పేరు షేక్ మస్తాన్. మాది సంబేపల్లె మండలం దేవపట్ల గ్రామం. నేను డిగ్రీ పూర్తి చేశాను. ప్రస్తుతం ఖాళీగా ఉన్నాను. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాను. ఇంకా ఎక్కడా ఉపాధి అవకాశం దొరకలేదు. కూటమి సర్కార్ మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లుగా నిరుద్యోగ భృతి కింద రూ. 3 వేలు అందిస్తే ఎంతోకొంత ఉపశమనం లభిస్తుంది. ప్రభుత్వ ఆ దిశగా స్పందించాలి.

ఏదీ కదలిక

సార్వత్రిక ఎన్నికల సమయంలో చంద్రబాబు అండ్ కో భారీ ఎత్తున హామీలు ఇచ్చినా వెంటనే అమలుకు చర్యలు తీసుకోలేదు. ఇంకా ఎన్ని రోజులు పడుతుందోనన్న ఆలోచన ప్రజల్లో మెదలుతోంది. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే రోజునే సూపర్ సిక్స్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తారని భావించారు. కానీ ఇంతవరకు అతీగతీ లేకపోవడంతో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇంకా ఎంత సమయం తీసుకుంటారో తెలియడం లేదు.

అన్నదాతకు ఏదీ భరోసా

అన్నదాతకు ప్రతి ఏడాది కష్టకాలం వెంటాడుతోంది. వైఎస్ జగన్ సర్కార్ అధికారంలో ఉన్నన్నాళ్లు రైతు భరోసా పేరుతో ఠంఛనుగా నిధులు మంజూరు చేస్తుండడంతో అన్నదాతకు అన్ని విధాలా ఉపయోగపడేది. అయితే కూటమి సర్కార్ అధికారంలో వచ్చాక ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలవుతున్నా ప్రకటించిన మేరకు అన్నదాత సుఖీభవ పథకం అమలుకు నోచుకోలేదు. కేంద్ర ప్రభుత్వం తన వాటాగా మొత్తాన్ని అందజేసినా రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో అన్నదాతలు పంటల సాగుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వర్షాలు లేక కరువు పరిస్థితులు కనిపిస్తున్న తరుణంలో వెంటనే నిధులు విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పాఠశాలలు ప్రారంభమైనా..

జిల్లాలో పాఠశాలలు జూన్ 13వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు పాఠశాలలకు కూడా వెళుతున్నారు. ఈ

వైఎస్ జగన్ సర్కార్ 2023-24లో వివిధ పథకాల కింద ఇచ్చిన మొత్తాలు

పథకం	లబ్ధిదారులు	ఆర్థిక లబ్ధి (రూ.కోట్లలో)
అమ్మ ఒడి	1,52,366	228.54
రైతు భరోసా	2,03,374	274.55

▶▶ కుప్పలు తెప్పలుగా హామీలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్న ఏకైక లక్ష్యంతో కుప్పలు తెప్పలుగా హామీలు కురిపించింది. సూపర్ సిక్స్ పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి రైతుకు ఏటా 20వేల ఆర్థికసాయం, ప్రతి మహిళకు నెలకు రూ.1500, యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు, లేదా నెలకు రూ.3వేల నిరుద్యోగభృతి, స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు, ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పారు. అంతేకాకుండా రైతుకూలీలకు కార్పొరేషన్లు, 90శాతం సబ్సిడీతో బిందుసేద్యం, ట్రాన్స్‌ఫార్మర్ ధర తగ్గింపు ఇలా చెప్పుకుంటూ పోతే కూటమి మేనిఫెస్టో 66 హామీలు గుప్పించింది.

నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్న యువత: **4,84,598**

ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద రూ. 15 వేలు ఇస్తామన్నా ఇప్పటికీ అతీగతీ లేదు. ప్రతి ఏడాది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమ్మ ఒడి క్రమం తప్పకుండా నిర్ణీత సమయానికే తల్లుల ఖాతాకు నిధులు జమ చేయడంతోపాటు విద్యార్థులకు పాఠశాల ప్రారంభం రోజే విద్యా సామగ్రితోకూడిన కిట్లను అందజేసేవారు. అయితే ప్రస్తుతం తల్లికి వందనం నిధుల కోసం ఇంకా ఎన్నిరోజులు ఎదురు చూడాల్సి వస్తుందోనని విద్యార్థుల తల్లులు పేర్కొంటున్నారు.

భృతి కోసం నిరీక్షణ

కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి దాదాపు నెలన్నర రోజులవుతున్నా నిరుద్యోగ భృతిపై కనీసం ఒక ప్రకటన కూడా చేయలేదు. ఎన్నాళ్లకిస్తారో... ఎలాంటి నిబంధనలు పెడతారోనన్న ఆందోళన నిరుద్యోగుల్లో ఉంది. ఉపాధి లేని నిరుద్యోగులకు ఒక్కొక్కరికి రూ. 3000 చొప్పున ఇస్తామని ప్రకటించినా నేటికీ ఆ ఊసే లేకుండా పోయింది. నిరుద్యోగులు ఎప్పుడెప్పుడా అని భృతి కోసం ఎదురు చూస్తున్నారు.

మా పిల్లలందరికీ తల్లికి వందనం ఇవ్వాలి



నాకు ఇద్దరు పిల్లలు. పెద్ద పాప షన మూడో తరగతి, రెండో పాప రజియా రెండో తరగతి చదువుతున్నారు. మాది సామాన్య కుటుంబం. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైతే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు చొప్పున తల్లికి వందనం ద్వారా ఇస్తామన్నారు. హామీ నిలబెట్టుకుని చదువుకునే పిల్లలందరికీ తల్లికి వందనం అందించాలి. -షహారాభాను, అప్పారావుతోట, మదనపల్లె.

హామీలు అమలు చేయాలి



ఎన్నికల సందర్భంగా కూటమి నేతలు ఇచ్చిన హామీలను తప్పక అమలు చేయాలి. అధికారాన్ని చేపట్టి 50 రోజులు గడుస్తున్నా కమిటీలు, సమీక్షల పేర్లతో కాలయాపన చేయడం పద్ధతి కాదు. చదువులే ఆస్తిగా భావించిన పేద పిల్లలకు తల్లికి వందనం, విద్యా దీవెన, వసతి దీవెనను వెంటనే అందివ్వాలి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు సాగుసాయం వంటి వాటిని ఇంతవరకు అమలు చేయలేకపోవడం అన్యాయం. -ఎంరామాంజులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

కాలయాపన చేయడం తగదు



ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ బూటకమేనని మరో మారు రుజువు అవుతోంది. పాఠశాలలు, కళాశాలలు తెరిచి నెలరోజులు గడుస్తున్నా విద్యార్థుల చదువులకు కావాలసిన డబ్బులు ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం మంచిది కాదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాయమాటలు నమ్మి మరోమారు ప్రజలు మోసపోయారు. - కొత్తిమీర ప్రసాద్,రాయచోటి

అశ్వవాహనంపై చెన్నకేశవస్వామి

రాజంపేట: తాళ్లపాక బ్రహ్మోత్సవాలు గురువారం ముగియనున్నాయి. కాగా బుధవారం చెన్నకేశవ స్వామి అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం చక్రస్నానం, ధ్వజావరోహణ కార్యక్రమాల ఉంటాయి. శుక్రవారం స్నపన తిరుమంజనం, . పుష్పయాగం కార్యక్రమాలు జరగనున్నాయి. శ్రీ సిద్దేశ్వరస్వామికి పార్వేట ఉత్సవం నిర్వహించారు. గురువారం త్రిశూలస్నానం, ధ్వజావరోహణ కార్యక్రమాలు ఉంటాయి.శుక్రవారం స్వామివారికి స్నపన తిరుమంజనం, పుష్పయాగం నిర్వహించనున్నారు.



అశ్వవాహనంపై కొలువుదీరిన శ్రీ చెన్నకేశవస్వామి

'మైలవరా'నికి నీరు నిలుపుదల

కొండాపురం: గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి నీటి సరఫరాను బుధవారం నుంచి నిలుపుదల చేసినట్లు జీఎన్ ఎస్ఎస్ డీఈ ఉమామహేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గండికోట జలాశయంలో నీటి మట్టం కనిష్ట స్థాయికి చేరిందన్నారు. గండికోట నుంచి తాగునీటి అవసరాల కోసం మైలవరం జలాశయాని నీటిని విడుదల చేస్తూ వచ్చామన్నారు. గండికోట జలాశయంలో ప్రస్తుతం 1.5 టీఎంసీలు మాత్రమే నీరుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.



మైలవరం జలాశయం

అసంపూర్తి భవనాలు పూర్తి చేయాలి

ఖాజీపేట: బాలుర ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణం వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్ జిల్లా విద్యాధికారి అనురాధ పాఠశాల హెచ్ఎం శివశంకర్ కు సూచించారు. ఖాజీపేటలోని బాలుర ఉన్నత పాఠశాల, అంగన్ వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల (మెయిన్ స్కూల్)ను తనిఖీ చేశారు. బాలుర ఉన్నత పాఠశాలలో నిర్మాణంలో ఉన్న భవనాలు చూశారు. భవనాలు అసంపూర్తిగా ఉండడాన్ని గమనించి.. వెంటనే పనులు పూర్తి చేయించాలని సూచించారు. పాఠశాల నిర్వహణ సక్రమంగా లేక పోవడం పై అసంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం వంటలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు అందే భోజనంలో క్వాలిటీ ఉండాలని సూచించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విద్యార్థులతో కలిసి ఆటలు ఆడుతున్న డీఈఓ శివకుమార్‌రెడ్డి

రామాపురం: క్రీడలతో మానసిక ఉల్లాసం పొందొచ్చని డీఈఓ శివకుమార్‌రెడ్డి అన్నారు. శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని గువ్వలచెరువు తెలుగు, ఉర్దూ, నీలకంఠ్రావుపేటలోని తెలుగు, ఉర్దూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పరిశీలించారు.

అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా అవసరమని చెప్పారు. వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అనంతరం నీలకంఠ్రావుపేట తెలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులకు సబ్జెక్టు వారిగా విద్యను అర్థమయ్యే విధంగా బోధించాలని సూచించారు. మార్చిలో జరగనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణశాతం పెంచాలన్నారు. పాఠశాలలకు సంబంధించిన మౌలిక సదుపాయాల గురించి హెచ్ఎం సుజాతమ్మను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ, పాఠశాల పీడీ ఎస్ నాగేందర్‌రెడ్డి, డీఓ కార్యాలయం సీసీ , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వేతన వెతలు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పనులు చేసిన నిరుపేదలకే కేంద్ర ప్రభుత్వం బకాయి పడింది. ఈ పథకం ద్వారా పేదలు, నిరుద్యోగులు, కూలీలకు కోట్ల వేతనాలను చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టింది. దీంతో రోజువారీ కూలీ పనులతో జీవించే పేదలు ఇబ్బందులు పడుతున్నారు. చేసిన పనికి వేతనాలు ఎప్పుడు చెల్లిస్తారా అని ఎదురుచూస్తున్నారు.

- మే 21 నుంచి ఉపాధి కూలీలకు వేతనాలివ్వని కేంద్రం
- ఇప్పటిదాకా జిల్లాలో రూ.48.93 కోట్లు పెండింగ్
- ఉపాధి పనులపై ప్రభావం

బి.కొత్తకోట: ఉపాధి హామీ పథకం పనులు చేసే కూలీలకు ఏ వారంలో ఎంత పని చేసుంటే ఆ పనికి సంబంధించిన మొత్తం వేతనం ఆయా కూలీల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ అయ్యేవి. గతంలో రాష్ట్రప్రభుత్వం నుంచి నిధులు విడుదల అయ్యేవి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పీఎఫ్ఎంఎస్ ద్వారా నేరుగా చెల్లింపులు చేస్తోంది. మే 21 నుంచి ఈ రోజు వరకు కూలీలకు చెల్లించాల్సిన సొమ్ము మొత్తం పెండింగ్‌లోనే పడింది.



జీవీ తాండాలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

రూ.48.93 కోట్లు రావాలి

అన్నమయ్య జిల్లాలో ఉపాధిహామీ పథకం ద్వారా పనులు చేసిన కూలీలకు రూ.48.93 కోట్లు బకాయి చెల్లించాల్సి ఉంది. ఇందు కోసం కూలీల వివరాలతో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతూ వస్తోంది. జిల్లాలో అత్యధికంగా లక్కిరెడ్డిపల్లె మండలంలో పనిచేసిన కూలీలకు రూ.3.44 కోట్లు చెల్లించాల్సి ఉంది. కోడూరు నియోజకవర్గంలో రూ.13.14 కోట్లు, మదనపల్లె నియోజకవర్గంలో రూ.1.86 కోట్లు, పీలేరు నియోజకవర్గంలో రూ.9.22 కోట్లు, రాజంపేట నియోజకవర్గంలో రూ.8.26 కోట్లు, రాయచోటి నియోజకవర్గంలో రూ.14.79 కోట్లు, తంబళ్లపల్లె నియోజకవర్గంలో రూ.7.66 కోట్ల బకాయిలు అందాల్సి ఉంది.



ఉపాధి వేతన బకాయి వివరాలు..

మండలం	బకాయి (రూ.కోట్లలో)
చిట్వేలి	2.50
కోడూరు	2.98
ఓబులవారిపల్లె	2.04
పెనగలూరు	2.91
పుల్లంపేట	2.68
మదనపల్లె	0.40
నిమ్మనపల్లె	0.28
రామసముద్రం	1.17
గుర్రంకొండ	0.63
కలకడ	0.81
కలికి రి	0.73
కేవీపల్లె	0.27
పీలేరు	0.40
వాయల్పాడు	0.36
నందలూరు	1.05
రాజంపేట	2.12
టి.సుండుపల్లె	2.61
వీరబల్లి	2.46
చిన్నమండెం	1.80
గాలివీడు	1.83
లక్కిరెడ్డిపల్లె	3.44
రామాపురం	2.72
రాయచోటి	1.92
సంబేపల్లె	3.04
బి.కొత్తకోట	0.84
కురబలకోట	0.64
ములకలచెరువు	1.83
పెద్దమండ్యం	2.01
పెద్దతిప్పసముద్రం	0.98
తంబళ్లపల్లె	1.33

ఇబ్బందుల్లో ఉన్నాం



రెండునెలలుగా ఉపాధి కూలీ డబ్బు అందలేదు. గోపాలపురం వద్ద మామిడితోటలో చెట్లకు పాదులు తీసే పనులు చేశాం. వారానికి రూ.1,800 కూలీ వస్తుంది. అందకపోవడంతో నిత్యావసర సరుకులు కొనుగోలుకు అవస్థలు పడాల్సిన పరిస్థితి. వెంటనే కూలీ డబ్బులు చెల్లించాలి. -దేగానిచంద్ర, కనసానివారిపల్లె, కురబలకోట మండలం

కూలీ డబ్బులు చెల్లించాలి



టీ.సదుం పంచాయతీ ఎర్రబల్లి ఊడవలకుంటలో నెలరోజులు పూడికతీత పనులు చేశాం. ప్రతి వారం ఖాతాలకు బిల్లులు జమ అయ్యేవి. రెండునెలలు గడిచినా డబ్బు అందలేదు. దీనివల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. కూలీ డబ్బు చెల్లించి ఆదుకోవాలి. -బయ్యారెడ్డి, ఎర్రబల్లి, పీటీఎం మండలం

త్వరలో బిల్లులు వస్తాయి



జిల్లాలో ఉపాధి పనులు చేసిన కూలీలందరికి రెండు-మూడు రోజుల్లో బిల్లులు అందుతాయి. కూలీలు ఆందోళన చెందవద్దు. పనిచేసిన కూలీ సొమ్మంతా ఖాతాలకు జమ అవుతాయి. కూలీలు యథావిధిగా పనులు చేయాలి. -మద్దిలేటి, డ్వామా పీడీ, రాయచోటి

జేసీగా ఆదర్శ్ రాజేంద్రన్ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ శ్రీధర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి: అన్నమయ్య జిల్లా జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా ఆదర్శ్ రాజేంద్రన్ బుధవారం ఉదయం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా కలెక్టర్ శ్రీధర్, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు సహకారంతో జిల్లాను అన్ని రంగాలలో ముందుకు నడిపించేందుకు కృషి చేస్తానని తెలిపారు. బాధ్యతల స్వీకరణకు ముందు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను రెవెన్యూ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు చేపట్టడానికి కలెక్టరేట్‌కు వచ్చిన నూతన జాయింట్ కలెక్టర్‌కు డీఆర్ఓ సత్యనారాయణరావు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

శ్రీ వీరభద్రస్వామిని దర్శించుకున్న జేసీ

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారిని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఈవో డివి రమణారెడ్డి ప్రధాన అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్‌కు స్వామి వారి శేషవస్త్రంతో పాటు తీర్థప్రసాదాలు అందించారు. అర్చకులు ఆలయ విశిష్టతను, స్థల పురాణాన్ని వివరించి చెప్పారు.

క్లుప్తంగా

లే అవుట్ యజమానులకు తాఖీదులు



లే అవుట్ వద్ద తాఖీదులు అతికిస్తున్న సిబ్బంది

పోరుమామిళ్ల : మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో అనుమతి లేకుండా లే అవుట్ వేసిన యజమానులకు తాఖీదులు జారీ చేసినట్లు మండల పంచాయతీ విస్తరణాధికారి రాజీవ్‌రెడ్డి తెలిపారు. పంచాయతీ పరిధిలోని వంద ఎకరాల స్థలంలో 14 లే అవుట్లు వెలిశాయని ఆయన తెలిపారు. కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అనుమతి లేకుండా వేయడంతో కొందరికి స్వయంగా, మరింత మందికి వాట్సాప్, ఇతర మార్గాల్లో తాఖీదులు ఇచ్చామని తెలిపారు. ఆ లేఅవుట్‌లో ఎలాంటి క్రయ, విక్రయాలు జరిగినా చర్యలు తీసుకుంటామన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలతో రైతులకు నష్టం



ఏఎస్పీ లోసారి సుధాకర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ

కడప కార్పొరేషన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో జరుగుతున్న ట్రాన్స్‌ఫార్మర్ చోరీలను అరికట్టాలని విద్యుత్తు శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రమణ కోరారు. ఏఎస్పీ లోసారి సుధాకర్‌ను బుధవారం కలిసి ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై ఫిర్యాదు చేశారు. రమణ మాట్లాడుతూ చాలా ప్రాంతాల్లో విద్యుత్తు శాఖకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి, అందులో కాపర్ వైరు చోరీ చేస్తున్నారన్నారు. దీంతో రైతులు సాగు చేస్తున్న పంటలకు, విద్యుత్తు శాఖకు తీరని నష్టం వాటిల్లుతోందని తెలిపారు. పోలీసులు నిఘా పెంచి చోరీలను అరికట్టాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఏడీఏకు గాయాలు

లింగాల : మండలంలోని వెలిగండ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముద్దనూరు ఏడీఏ సుబ్బయ్యకు గాయాలయ్యాయి. వెలిగండ్ల, పార్లపల్లి గ్రామాలలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసేందుకు వెళ్లిన ఆయన ద్విచక్ర వాహనంలో తిరిగి వస్తుండగా ఓ మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆయనకు, వాహనాన్ని నడుపుతున్న బాషాకు గాయాలయ్యాయి అంబులెన్స్ సాయంతో పులివెందులలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా

తిరుపతి సిటీ : తిరుపతి కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా లభించినట్లు డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్‌రెడ్డి తెలిపారు. విద్యా ప్రమాణాల్లో మార్పులకు అనుగుణంగా కళాశాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన, ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనే లక్ష్యంగా యాజమాన్యం పనిచేస్తోందన్నారు. కళాశాలలో చదివిన వేలాది విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్‌లో ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థాయిలో ఉండడం సంతోషకరమని అన్నారు. ఇటీవల శ్రీరామ కళాశాలకు యూజీసీ నాక్ ఏ గ్రేడ్ లభించిందన్నారు. ఈ గుర్తింపు రావడానికి కృషి చేసిన చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డికి, ప్రిన్సిపల్ కె.జయచంద్ర, అధ్యాపక బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వేధింపులతో వివాహిత ఆత్మహత్య

- పెళ్లయిన ఆరు నెలలకే ఉరి వేసుకుని బలవన్మరణం
- అత్తింటివారే చంపేశారని కుటుంబసభ్యుల ఫిర్యాదు
- మనస్థాపంతో అత్త ఆత్మహత్యాయత్నం



వేధింపులతో ఆత్మహత్యకు పాల్పడిన సాయిప్రియాంక మృతదేహం



సాయిప్రియాంక పెళ్లి నాటి ఫొటో (ఫైల్)



మనస్థాపం చెందిన ఆత్మహత్యయత్నంకు పాల్పడిన సాయిప్రియాంక అత్త ఉష

మదనపల్లె : ఒకే ఊరిలో వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్న అబ్బాయి, అమ్మాయి ఆన్‌లైన్ వేదికగా పరిచయమై ప్రేమించుకున్నారు. పెద్దల అనుమతితో వివాహం చేసుకుని నూరేళ్ల ప్రయాణం ప్రారంభించారు. అయితే అత్తింటి వేధింపులు ఆ అమ్మాయిని మానసిక వేదనకు గురిచేశాయి. పెళ్లయిన ఆరు నెలలకే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన బుధవారం మదనపల్లెలో వెలుగు చూసింది. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని రాంనగర్‌కు చెందిన వెంకటరమణ, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె సాయి ప్రియాంక(24) బాబూ కాలనీకి చెందిన శ్రీనివాసులు, ఉష దంపతుల కుమారుడు మణికంఠతో ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైంది. కొంతకాలం తరువాత ఇరువురూ ప్రేమించుకున్నారు. వారి ప్రేమను ఇరు కుటుంబ సభ్యులు అంగీకరించి వివాహం జరిపించారు. కొన్ని రోజుల కిదట మణికంఠ చేనేత పని మానేసి టమాట మార్కెట్‌లో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసిన అతడు కొద్ది రోజుల కిందట భార్య సాయి ప్రియాంకను వేధించసాగాడు. మంగళవారం రాత్రి మరోసారి కట్నం విషయమై భార్య, భర్తల మధ్య గొడవ జరిగింది. వేధింపులు తీవ్రం కావడంతో రాత్రి అందరూ నిద్రపోయాక ఇంట్లోనే సాయి ప్రియాంక చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. తెల్లవారు జామున గమనించిన కుటుంబ సభ్యులు, తాలూకా పోలీసులు, పుట్టింటివారికి సమాచారం అందించారు. ఎస్.ఐ రవి కుమార్ ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దారు రమాదేవి కుటుంబ సభ్యుల వాంగ్మూలం నమోదు చేసి శవ పంచనామా చేశారు.

కుటుంబ సభ్యుల ఆందోళన

సాయిప్రియాంక మృతి విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు తాలూకా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని కట్నం కోసం వేధించిన ప్రియాంక భర్త మణికంఠ, మామ శ్రీనివాసులు,అత్త ఉష,తాత మునెప్పలపై కేసు నమోదు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ విషయంతో మనస్థాపం చెందిన సాయి ప్రియాంక అత్త ఉష (49) ఇంటివద్దే పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. బాధితురాలిని కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఐసీయూ విభాగంలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై మృతురాలి తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

ప్రజాధనం లూటీ చేస్తున్న కేంద్రం

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు



సభలో మాట్లాడుతున్న ఓబులేసు

బి.కొత్తకోట : కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజాధనాన్ని లూటీ చేసి కార్పొరేట్లకు దోచిపెడుతోందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు ఆరోపించారు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం హార్సిలీ హిల్స్‌పై మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం కార్మిక వర్గంపై దాడులకు పూనుకుందన్నారు. అనేక పోరాటాలు, త్యాగాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలు, హక్కులను నిర్వీర్యం చేస్తోందన్నారు. వికసిత భారత్ కు 2024–25 బడ్జెట్ తోడ్పడుతుందని ముందుగానే మీడియాలో కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుందని, తీరా బడ్జెట్ చూస్తే కార్మిక వర్గానికి నిరాశ కలిగించిందన్నారు. ఈ బడ్జెట్ తో దేశంలో ప్రైవేటీకరణ వేగవంతం అవుతుందన్నారు. అమరావతికి రూ.15 వేల కోట్లు ఆర్థిక సంస్థల ద్వారా ఇప్పిస్తామని ఆర్థిక మంత్రి పేర్కొనడంతో రాష్ట్రానికి కలిగే లాభం లేదన్నారు. ఈ నిధులు బడ్జెట్ లో ఇస్తామని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన ఉద్యోగుల పీఆర్సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, మున్సిపల్ కార్మికుల గత సమ్మె కాలపు హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్, గౌరవాధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి, కార్య నిర్వాహక అధ్యక్షుడు రామారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు, తులసేంద్ర, రామచంద్రయ్య, అన్నమయ్య సాంబశివ, బందెల రవి, రాజేష్ గౌడ్, సురేష్ కుమార్, సలీం బాషా, మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

వణికిస్తున్న విషజ్వరాలు



విష జ్వరంతో బాధపడుతున్న చిన్నారి నిశ్చిత

రామాపురం : మండలంలోని హసనాపురం పంచాయతీ పరిధిలోని చీకటివాండ్లపల్లెలో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. దోమల బెడద ఎక్కువై జనం జ్వరాలతో అల్లాడిపోతున్నారు. ఎక్కడ చూసినా అపరిశుభ్రత పేరుకుపోవడంతో స్థానిక ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీలో చదువుతున్న 20 మంది బాల, బాలికలు వాంతులు విరోచనాలతో ఆస్పత్రి పాలయ్యారు. గ్రామంలో నిశ్చిత, శ్రీధర్‌నాయుడు, ఉమేష్‌నాయుడు, ధ్రువిక, నందిని కడపలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరింత మందిని రాయచోటి, కడప ప్రాంతాలకు తీసుకుపోతున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. దీక్షితకు డెంగీ జ్వరం అని పరీక్షించిన వైద్యులు చెప్పడంతో కడప ఆసుపత్రికి తరలించారు. ఎక్కువగా చిన్నపిల్లలకే జ్వరాలు, వాంతులు, విరోచనాలు కావడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వైద్యాధికారి వినోద్ కుమార్ వివరణ కోరగా గ్రామంలో సిబ్బంది పర్యటించారని, గురువారం ఉదయం వైద్య శిబిరం ఏర్పాటుచేసి ఇంటింటా వైద్యపరీక్షలు చేశామని తెలిపారు.

మహిళను బెదిరించి.. నగల చోరీ



బీరువా తెరచి వుంచిన దృశ్యం

పీలేరు రూరల్ : ఒంటరి మహిళపై దాడిచేసి బంగారు, నగదు చోరీ చేసిన సంఘటన మంగళవారం రాత్రి పీలేరు పట్టణ శివారు ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె మార్గంలోని హుమయూన్ ఫంక్షన్ హాల్ సమీపంలో ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదేషావలి తన కుటుంబసభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి బోదేషావలి తల్లి జహరాబీ ఒక్కరే ఇంట్లో ఉన్నారు. ఈ విషయం గమనించిన గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి ఆమెపై రాయితో దాడి చేశారు. ఆమె వద్ద ఉన్న 60 గ్రాముల బంగారు గాజులు, కమ్మలు, ముక్కు పుడక లాక్కొన్నారు. అనంతరం బీరువాలో ఉన్న రూ. 60 వేల నగదు తీసుకుని ఉడాయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు.. రాయచోటి డీఎస్పీ రామచంద్రరావు, సీఐ మోహన్‌రెడ్డి, వేలిముద్ర నిపుణులు, డాగ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

తాళం వేసిన ఇంట్లో చొరబడి...

ములకలచెరువు : మండలంలోని వేపూరికోట పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న ఓ ఇంట్లో మంగళవారం చోరీ జరిగింది. ఇంటి యజమాని చంద్రశేఖర్‌రెడ్డి తాళం వేసి కుటుంబ సభ్యులతో బెంగళూరుకు వెళ్లారు. గుర్తుతెలియని దుండగులు చాకచక్యంగా తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న నాలుగున్నర కిలోల వెండి దోచుకెళ్లారు. ఇంటికి అమర్చిన సీసీ కెమెరాలను ధ్వంసం చేసి.. హార్డ్ డిస్క్ అపహరించుకెళ్లారు. ఇంటికి వచ్చి చూసిన చంద్రశేఖర్‌రెడ్డి చోరీ విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ తిప్పేస్వామి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

కేసీ కెనాల్‌లో పడి వ్యక్తి మృతి

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్మాస్‌పేట యానాది కాలనీకి చెందిన యాకసిరి నరసయ్య (51) ఈ నెల 22న మధ్యాహ్నం ఇంటి నుంచి వచ్చి కేసీ కెనాల్‌లో ప్రమాదవశాత్తు పడి మరణించాడు. అతని భార్య యాకసిరి అంకమ్మ ఫిర్యాదు మేరకు తన భర్తకు మూర్ఛ వచ్చేదని, సోమవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదని అన్నారు. బుధవారం పోలీసుల సమాచారంతో తన భర్త కేసీ కెనాల్‌లో పడి మృతి చెందినట్లు తెలిసిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంజీవరాయుడు తెలియజేశారు.

చెట్టుకు ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పోరుమామిళ్ల : మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందివ్వడంతో ఎస్ఐ తిమోతి కేసు నమోదు చేశారు. ఎస్ఐ వివరాల మేరకు.. కర్నూలు జిల్లా ఆత్మకూరుకు చెందిన పెద్ది చంద్రశేఖర్ పోరుమామిళ్ల పరిధిలోని బలిజకోటలో పందుల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. స్థానిక యువతి సరస్వతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు పిల్లల సంతానం. ఇటీవల మద్యానికి బానిసైన చంద్రశేఖర్ సంపాదనంతా.. విచ్చలవిడిగా ఖర్చు చేస్తుండటంతో అతడి భార్య సరస్వతితో విభేదాలు తలెత్తాయి. గత రెండేళ్లుగా ఇంటికి దూరంగా ఉంటూ ఆత్మకూరులో బేల్దారి పనులు చేసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం రంగసముద్రం సమీపంలో చెట్టుకు వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. స్థానికులు పోలీసులకు తెలుపడంతో ఎస్ఐ పరిశీలించి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు.

కుష్టు వ్యాధి అనుమానితులకు మందుల పంపిణీ

అడిషనల్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిబాబు



కుష్టు వ్యాధి లక్షణాలను పరిశీలిస్తున్న, అడిషనల్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిబాబు

సిద్దవటం : ప్రత్యేక సర్వే ద్వారా కుష్టు వ్యాధి అనుమానితులను గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు అడిషనల్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిబాబు తెలిపారు. సిద్దవటం సమీపంలోని దిగువపేటలో జరుగుతున్న సర్వేను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేసి మహిళా ఆరోగ్య కార్యకర్తలకు సలహాలు ఇచ్చామన్నారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు, చెవులు, వీపు, ఎదపై నొప్పిలేని బొడిపెలు, కనుబొమ్మలు, తదితర లక్షణాలు ఉంటే సర్వే అధికారులకు చూపించాలని కోరారు. లక్షణాలు ఉన్న వారికి ఎండీటీ మందులు ఉచితంగా అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు విక్టర్ మనోహర్, డీపీఎంఓ లక్ష్మీనారాయణ, సీహెచ్ఓ లోకేశ్వరి, పద్మావతి, లక్ష్మమ్మ, భారతి పాల్గొన్నారు.

ప్రాణం కాపాడిన పోలీస్



లొకేషన్ గుర్తించి కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీస్

రాయచోటి టౌన్ : మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడబోయిన ఓ యువకుడిని పోలీసులు కాపాడి.. కౌన్సిలింగ్ ఇచ్చారు. అన్నింటికన్నా విలువైనది ప్రాణం. ప్రాణాల విలువ తెలుసుకొని జీవించాలంటూ హితవు పలికారు. అర్బన్ ఎస్ఐ భక్తవత్సలం వివరాల మేరకు.. కుటుంబ కలహాలతో రాయచోటి పట్టణానికి చెందిన ఎస్.నాగేశ్వర రావు మనస్తాపం చెందాడు. పట్టణ శివారుకు మంగళవారం చేరుకొని అక్కడినుంచి కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. «నేను బాధలు భరించలేక పోతున్నా.. బ్రతకడం ఇష్టం లేదు.. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నా.» అంటూ ఫోన్‌లో భార్య, అమ్మా, నాన్నలకు తెలిపాడు. కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై భక్తవత్సలం ఫోన్ లొకేషన్ గుర్తించి వెంటనే కానిస్టేబుల్ జగన్‌ను ఆ ప్రదేశానికి వెళ్లమని సూచించారు. అనంతరం కానిస్టేబుల్ వెళ్లి అతడిని ఆత్మహత్యకు పాల్పడకుండా స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఎస్సై భక్త వత్సలం నాగేశ్వరరావుతోపాటు, ఆయన భార్య, అమ్మనాన్నలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆవేశాలు, కోపాలకన్నా ప్రాణాలు విలువైనవని చెప్పి ఇంటికి పంపించారు.

మల్టీడేస్ క్రికెట్ పోటీలు ప్రారంభం



127 పరుగులు చేసిన శ్రీకాకుళం జట్టు బ్యాట్స్‌మన్ సుకాంత్



5 వికెట్లు తీసిన శ్రీకాకుళం బౌలర్ పూర్ణ



5 వికెట్లు తీసిన విశాఖ బౌలర్ దేవాశిష్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానలు వేదికగా ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, పశ్చిమగోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 79.3 ఓవర్లలో 215 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమగోదావరి జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 19 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 28 పరుగులు చేసింది.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో నెల్లూరు, శ్రీకాకుళం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 29.3 ఓవర్లకే 119 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. శ్రీకాకుళం బౌలర్ పూర్ణ 5 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 59 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 262 పరుగులు చేసింది. జట్టులోని ఎస్. సుకాంత్ 80 బంతుల్లో 127 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి శ్రీకాకుళం జట్టు 143 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

కేఎస్ఆర్ఎం మైదానంలో..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విశాఖపట్నం, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని తొలిరోజు ఆట ముగిసే సమయానికి 88.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 286 పరుగులు చేసింది. జట్టులోని వరుణ్ 79 పరుగులు చేశాడు. విశాఖ బౌలర్లు దేవాశిష్ 5 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

అగ్నిప్రమాద ఘటనపై పారదర్శక విచారణ

- ఇద్దరు ఆర్డీఓలు, 35 మంది రెవెన్యూ అధికారుల విచారణ
- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



సబ్ కలెక్టరేట్ కార్యాలయం ముందు ఆవేదన వ్యక్తం చేస్తున్న గౌతమ్‌తేజ్ సోదరుడు ప్రభు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

మదనపల్లె : సబ్ కలెక్టరేట్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో ప్రభుత్వ ఉద్యోగులు, కొందరు వ్యక్తుల ప్రమేయం ఉండటంపై విచారణ చేస్తున్నామని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. మదనపల్లె సబ్ కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో మీడియాతో ఆయన మాట్లాడుతూ...రోజా ఆర్డీఓ హరిప్రసాద్, గతంలో ఆర్డీఓగా పనిచేసిన ఎం.ఎస్.మురళీలతోపాటు, మరో 35 మంది సబ్ కలెక్టరేట్ సిబ్బందిని విచారిస్తున్నట్లు తెలిపారు. ప్రమాద ఘటన తెలిసిన వెంటనే డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ శ్యాంపిళ్ల సేకరణ చేశామన్నారు. కాల్చేందుకు ఉపయోగించిన మెటీరియల్ను పకడ్బందీగా భద్రపరిచామన్నారు. సుమారు 700 ఫైళ్లను గుర్తించి, సెక్షన్ల వారీగా విభజించాల్సిందిగా అధికారులకు అందించామన్నారు. విద్యుత్తు సరఫరాపై ఆ శాఖ అధికారులు నివేదిక తయారుచేశారన్నారు. సీడీఆర్ అనాలసిస్, టవర్ లొకేషన్ నుంచి సేకరించిన డేటా, 21 కెమెరాల నుంచి తీసుకున్న సీసీటీవీ పుటేజీలను పదిబృందాలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయని తెలిపారు. త్వరలోనే దోషులను గుర్తిస్తామన్నారు.

అమాయకుడిని బలి చేస్తున్నారు

మదనపల్లె : ఉన్నత చదువులు అభ్యసించి.. ఉద్యోగం చేస్తున్న వ్యక్తిని బలిపశువు చేస్తున్నారని సబ్ కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్ కుటుంబ సభ్యులు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ కలెక్టరేట్ వద్దకు చేరుకున్న గౌతమ్ తేజ్ సోదరుడు గోరంట్ల ప్రభు మాట్లాడుతూ అగ్నిప్రమాదం ఘటనకు తమ కుటుంబసభ్యుడిని బాధ్యుడిగా పేర్కొంటూ ప్రచారం చేయడాన్ని ఆక్షేపించారు. గౌతమ్‌తేజ్ తండ్రి వరదరాజులు చనిపోవడంతో కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగంలో చేరాడన్నారు. చిత్తూరు కలెక్టరేట్‌లో పనిచేస్తున్న గౌతమ్‌తేజ్‌ను కమ్మ కులానికి చెందినవాడనే సాకుతో అక్కడి నుంచి వి.కోటకు బదిలీ చేశారన్నారు. మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తూ ఆదివారం వ్యక్తిగత పనులపై చిత్తూరుకు వెళ్లిన తేజ్‌కు ఆర్డీఓ హరిప్రసాద్ ఫోన్‌చేశారన్నారు. రిలీవ్ అవుతున్నందున పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేసేందుకు రావాలని ఆదేశించారన్నారు. సోమవారం ఉదయం సబ్ కలెక్టరేట్‌లో అగ్ని ప్రమాదం జరగ్గా, ఈ ఘటనకు గౌతమ్ తేజ్‌ను బాధ్యుడిని చేస్తూ వార్తలు రావడం తగదన్నారు. ఘటనలో భాధ్యులైన ఆర్డీఓ, ఇతరుల పేర్లు ఎందుకు బహిర్గతపరచడం లేదని ప్రశ్నించారు. పోలీసులు పారదర్శకంగా విచారించి అసలు దోషులను బయటపెట్టాలన్నారు.

పుష్పగిరిలో పురావస్తు అధికారుల పర్యటన

వల్లూరు : ప్రముఖ పుణ్యక్షేత్రం పుష్పగిరిని కేంద్ర పురావస్తు శాఖ అధికారులు బుధవారం సందర్శించారు. ఆ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఇంజినీర్ భాను ప్రకాష్ వర్మ, కడప జిల్లా సీఏ బాలకృష్ణారెడ్డి, సర్వేయర్ ఫణీంద్ర, తదితరులు కొండపై లక్ష్మీచెన్నకేశవ స్వామిని దర్శించుకున్నారు. సంతాన మల్లేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ గోపురం, ఇతర నిర్మాణాలను వారు పరిశీలించారు. మరమ్మతులు చేపట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వారు పేర్కొన్నారు. అనంతరం చెన్నూరు కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పురావస్తు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల బలోపేతం

– డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ



సంఘాలు బలోపేతానికి కృషి చేయాలని వివరిస్తున్న పీడీ సత్యనారాయణ

రామాపురం : పల్లెల్లో స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు అందరూ కృషి చేయాలని డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని స్వయం సహాయక సంఘం కార్యాలయంలో జరిగిన ఎంపిసీఓవీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకుల్లో శ్రీనిధి, వ్యక్తిగత రుణాలు అందించేందుకు సీసీలు కీలకపాత్ర వహించాలన్నారు. వీఓఏల వద్దకు వెళ్లి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తున్నారా? లేదా? అనే విషయాలను కచ్చితంగా పొందుపరచాలన్నారు. వీటితో పాటు సీసీలు హాజరై సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీలు నాగభూషణరెడ్డి, శ్రీనివాసులు, నరసింహులు, నాగరాజు, ఆదినారాయణ, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌కు వన్‌టౌన్ సీఐ వలీబాషు

– ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

మదనపల్లె : మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాద ఘటన విషయంలో అలసత్వం ప్రదర్శించినందుకు వన్‌టౌన్ సీఐ వలీబాషును వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఇదే ఘటనకు సంబంధించి వన్‌టౌన్ కానిస్టేబుళ్లు హరిప్రసాద్, భాస్కర్‌లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ... ఘటన జరిగినపుడు సంఘటనాస్థలానికి ఆలస్యంగా చేరుకోవడం, ప్రమాద సమాచారం ఉన్నతాధికారులకు తెలియపరచకపోవడంతో క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సీఐను వీఆర్‌కు, కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసినట్లు చెప్పారు.

ఏడీఏకు గాయాలు

లింగాల : మండలంలోని వెలిగండ్ల వద్ద జరిగిన ప్రమాదంలో ఏడీఏకు గాయాలయ్యాయి. వెలిగండ్లలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసేందుకు వెళ్లిన ఆయన ద్విచక్ర వాహనంలో తిరిగి వస్తుండగా ఓ మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆయనకు, వాహనాన్ని నడుపుతున్న బాషాకు గాయాలయ్యాయి.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

బద్వేలు అర్బన్ : ఎర్రచందనం దుంగలను అటవీ సిబ్బంది బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఒక స్మగ్లర్‌తోపాటు, వారికి సహకరించిన ముగ్గురు ప్రొటెక్షన్ వాచర్లను అరెస్టు చేశారు. మైదుకూరు డీఎస్పీ టి.వెంకటేశులు వివరాలు వెల్లడించారు. వైఎస్సార్ కడప జిల్లా సరిహద్దున పి.పి.కుంట సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం దుంగలు రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచారని అటవీ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు రూరల్ సీఐ బీవీ. విక్రమసింహ, ఎస్ఐ జి.రవికుమార్, సిబ్బంది దాడులు నిర్వహించారు. రేగిమానుకుంట ప్రాంతంలో కొందరు వ్యక్తులు దుంగలు వాహనంలోకి లోడ్ చేస్తూ కనిపించారు. నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం చుంచులూరుకు చెందిన షేక్ రసూల్, మర్రిపాడు మండలం అనంతపురానికి చెందిన పాలెం పెంచలప్రసాద్, మర్రిపాడు మండలం తిమ్మనాయుడుపేటకు చెందిన అప్పలపోలు చిన్నయ్య, నెల్లూరు జిల్లా వింజమూరు మండలం యర్రబల్లిపాలెంకు చెందిన పేరుమోసిన స్మగ్లర్ గుద్దేటి రామనాథరెడ్డి అలియాస్ వింజమూరు రామనాథరెడ్డిలను పట్టుకున్నారు. వారి నుంచి 59 ఎర్రచందనం దుంగలతోపాటు, ఓ మినీ లారీ, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.